
CHANDRA

# ఓ పరమాత్మ కథ 'సాక్షి'



ఆగస్ట్ 23,

ఇవాళ నా పుట్టినరోజని చెప్పింది అమ్మ.

"పుట్టినరోజే నీవు చచ్చిపోయావు" అంది నా దెయ్యం.

షేక్స్పియర్‌ది, గురజాడదీ పుట్టినరోజూ, చనిపోయిన రోజూ ఒకటేనట. అసలు వాళ్ళకి చావు లేదు. జననమే.. వాళ్ళు అమరులు.. నేనూ వాళ్ళ లాంటి వాడినేనా?

"వాళ్ళు బ్రతికారు. బ్రతుకుతున్నారు. బతుకుతారు. నువ్వు బతికిందెక్కడ?" అంది దెయ్యం.

"మరైతే ఇప్పుడు నేనెవర్ని?"

"నువ్వు ఎవరివో కాదు. నువ్వు-నేనే"

"అంటే.. అంటే.. నేను దెయ్యాన్నా?" అన్నాను భయంతో ఒణికిపోతూ.

దెయ్యం నవ్వింది. "ఇంకా అనుమానంగా వుందా" అని అడిగింది. చటుక్కున నేను నా కాళ్ళూ చేతులూ చూసుకున్నాను. కాళ్ళు వెనక్కి తిరిగి లేవు. చేతులు వంకర తిరిగిలేవు. నేను నేను లాగానే వున్నాను. 'హమ్మయ్య' అని నిశ్చింతగా అనుకొని భారంగా నిట్టూర్చాను.

దెయ్యం పకపకా నవ్వింది. కడుపు చేత్తో పట్టుకొని బలవంతంగా నవ్వుని దిగమింగుకోడానికి ప్రయత్నిస్తూ "నువ్వు.. నువ్వు.. యింకా మామూలుగానే వున్నాననుకుంటున్నావా" అని అడిగింది.

"ఏం నాకేమైంది"

"ఒక్క కాళ్ళూ చేతులేం కర్మ. మొత్తం మనిషివే వంకర తిరిగిపోయావ్. అలాటప్పుడు నీకు నువ్వు సక్రమంగానే కన్పిస్తావ్" అంది దెయ్యం.

నా వెన్నుపూస లోంచి భయం ఒక్కసారిగా నా ఒళ్ళంతా పాకిపోయింది. నిలువునా ఒణికిపోయాను. నువ్వన్నట్లు నేను నిజంగా పూర్తిగా వంకర తిరిగిపోయి వుంటే నాకు ఈ లోకంలో వాళ్ళు అంతా అడ్డదిడ్డంగా కనిపించాలి కదా! నాకు ఎవరూ అలా కనిపించడంలేదు"

ఎలా కన్పిస్తారు. వాళ్ళు మనుషులైతే కదా అలా కన్పించేది. వాళ్ళంతా కూడా దెయ్యాలే" అంది దయ్యం.

ఇది కలోనిజమో నాకర్థం కాలేదు. మండుతున్న చితులమధ్య, నిర్మానుష్యమైన శ్మశానం నడుమా నేను లేను. నా చుట్టూ పొగమంచు లాంటి ఆకారాలూ కదలటం లేదు. అతి శ్రద్ధగా అందంగా అధునాతనంగా తీర్చిదిద్దిన నా పడగ్గదిలో మంచం మీద ముసుగుతన్ని పడుకొని వున్నాను. అంచేత ఇది నిస్సందేహంగా కలేననుకొన్నాను.

"పిచ్చివాడా! ఇంకా నీకు అనుమానంగా వుందా" అంది దయ్యం. "ఇది అబద్ధం. పచ్చి అబద్ధం. నేను నా అంతటివాణ్ణి దెయ్యం రావడం ఏమిటి? నేను నమ్మను" అని గట్టిగా కేకలువేస్తూ లేచిపోయి నన్ను నేను గిల్లుకొని చూసుకున్నాను. మంట పుట్టింది. నే చచ్చిపోతే, నేను దయ్యాన్నైతే నాకెందుకు మంట పుడుతుంది.

నా అరుపులు విని అమ్మలేచి "ఏం నాన్నా ఏమైనా పీడకల వచ్చిందా" అని అడిగింది.

"అబ్బే లేదమ్మా... ఏం లేదు" అన్నాను కంగారుపడుతూ.

పకాల్న నవ్వింది దయ్యం. చూశావా ఇప్పుడు నువ్వు నిజంగా బతికుండి వుంటే ఇలా మీ అమ్మకి అబద్ధం ఎందుకు చెప్పేవాడివి' అంది వెటకారంగా.

దెయ్యానికేమీ సమాధానం చెప్పకుండా మొహం కడుక్కోవడానికి బయటికి నడిచాను.

దెయ్యం నాతోపాటూ మొహం కడుక్కొంది. నే చేసిన ప్రతిపనీ అదికూడా చేసింది. కాఫీ తాగుతుంటే కాఫీ కప్పులో కత్తిలా కన్పించి వెక్కిరించింది. 'ఇంకా అనుమానంగా వుందా"

కోపంతో కప్పు గిరాటువేశాను. 'ఏమైందిరా?' అంటూ వచ్చింది అమ్మ.

"ఏం కాలేదు కప్పు జారిపోయింది"

"చూడు చూడు. నువ్వు జీవించి వుంటే ఇలా చెప్పేవాడివికావు' అంది దెయ్యం.

"షటప్" అన్నాను.

అమ్మ నాకు పిచ్చిపట్టిందేమోనన్నట్టుగా నాకేసి భయంభయంగా చూస్తూ పగిలిన గాజు ముక్కల్ని ఏరసాగింది.

ఆఫీస్ రూములోకెళ్ళి ఆ రోజు వున్న కేసుల తాలూకు ఫైళ్ళు తిరగెయ్యసాగాను. ఫైళ్ళ తిరగేస్తున్నానన్నమాటేగాని నా దృష్టి అంతా దెయ్యం అన్న మాటల మీదే వుంది. "నేను నిజంగానే చచ్చిపోయానా! ఇదంతా మనుషులు నివసిస్తున్న ప్రపంచం కాదా! దయ్యాలూ, భూతాలూ ఉండేలోకమా! అని తరచితరచి నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను. నాలోనవన్ని వదిలేసినట్టుగా.

"ఇవాల్టి రోజు నిన్ను నీవు గమనిస్తే చాలు నువ్వు మనిషివి లేదని తేలిపోతుంది. ఏమంటావు" అని అడిగింది దెయ్యం.

"సరే అలాగే చేద్దాం" అన్నాను.

అమ్మ ఏదో స్వీట్ తయారుచేసి బయటనుండి కేకులు తెప్పించింది. నీ ఫ్రెండ్స్‌ని పిలవరా" అంది.

"ఎందుకూ" అన్నాను.

"ఇవాళ నీ పుట్టిన రోజు కదా! ఫైళ్ళు ముందేసుకుని ఒప్పు మర్చి పోతే ఎలారా!"

"ఇవాళ నువ్వు చచ్చిన రోజు" అంది దెయ్యం.

"నాకిష్టం లేదమ్మా"

"మరి ఇవన్నీ ఎవరికోసం చేసినట్లు"

